# కాశీపతి



చెట్లూరి సీతారాజేశ్వరరావు

కాశీపతి కుర్చీలో కునికిపాట్లు పడుతున్నాడు. ఆఫీసరు వెళ్ళేదాకా ఫైల్సు రాస్తున్నట్లు నటించాడు. జీపు రోడ్డెక్కగానే డెస్క్‌మీద కాళ్ళు జాపి సిగరెట్ వెలిగించాడు.

నిద్ర ముంచుకు వస్తున్నది. పేకాటతో రాత్రి నిద్రలేదు. లాభంలేదు. వంద పోయింది. ప్రొద్దుటికి సిగరెట్ పెట్టెకు డబ్బులు కూడా లేవు.

కళ్యాణి నెక్లెసు తాకట్టు పెట్టి

ఆడాడు, గెలవకపోతామా అని? చివరికి దురదృష్టమే పల్కరించింది. కళ్యాణి పుట్టింటికి వెళ్ళింది. రేపో మాపో వచ్చేస్తుంది.

నెక్లెసు ఎలా, తీసుకురావడం? కళ్యాణికి తెలిస్తే దుంప తెంచుతుంది. నానా గొడవా చేస్తుంది. నలుగురిలోను తనని గాడిద చేస్తుంది!

పేకాటకి వెళ్లేముందు ఉండాల్సిన వివేకం యిప్పుడొచ్చింది కాశీపతికి. ఇలా ఎన్నోసార్లు అయింది. జూదంలో ఎంతో డబ్బు పోగొట్టుకున్నాడు.

ఎనిమిదివందలు వస్తున్నా దరిద్రమే. తను చాల దురదృష్టవంతుడు. అదృష్టం ఏ ఒక్కసారీ పల్కరించదేం? అదృష్టం రాకున్నా దాన్నే వెతుక్కుని కాశీపతి పోతున్నాడు.

కాశీపతి బద్ధకంగా లేచాడు. క్యాంటీన్ కేసి నడిచాడు. వాచీ పన్నెండున్నర చూపిస్తోంది. కాశీపతి గుమ్మాలు ఎక్కుతూంటే.

"నాన్నా... అమ్మ తాళం యిమ్మంటోంది." నానిగాడు పరుగెత్తుకొచ్చాడు.

కాశీపతి గుండెల్లో రైళ్లు, తుఫానులు ...ఎప్పుడో అనుకుంటున్న గండం ఈ క్షణమే వచ్చి పడింది.

"నాన్నా...మామయ్య పెళ్ళి. మళ్ళీ వెళ్ళాలి మనం."

కాశీపతి అదో ప్రపంచంలో ఉన్నాడు. యాంత్రికంగా నానిగాడికి తాళం యిచ్చాడు. భోజనానికి యింటికి వెళ్లే ధైర్యం లేకపోయింది.

క్యాంటీన్‌లో ఉప్మా బాగా లేకపోయినా రెండు ప్లేట్లు తిని కాఫీ త్రాగాడు. మనసు తీవ్రంగా ఆలోచించే ఉపాయాన్ని సిద్ధంచేసింది.

దాంతో కాశీపతికి బలమొచ్చింది.

సాయంత్రం ఆఫీసు కాగానే నిన్న తాకట్టుపెట్టిన మార్వాడీ కొట్టుకెళ్లాడు. నెక్లెసును అమ్మివేశాడు. మరో ఎనభై రూపాయ లిచ్చాడు సేటు.

కాశీపతి డూప్లికేటు కొన్నాడు యిరవై రూపాయి లిచ్చి.

"కళ్యాణి గుర్తుపట్టలేదు." ధైర్యం చెప్పుకున్నాడు.

జీతం వచ్చేదాకా గండం గడిస్తే చాలు. అప్పుడు మరోటి కొంటాడు. ఈ నాలుగురోజులు మర్యాద దక్కితే చాలు.

ఇంటికి వెళ్లేసరికి ఏడయింది. కళ్యాణి ప్రక్కవాటాలోని యింజనీరు గారి పెళ్ళాంతో కబుర్లు చెబుతోంది.

నెక్లెసును ఆమె వచ్చేలోగా పెట్టెలో పెట్టేశాడు.

"మధ్యాహ్నం భోజనానికి రాలేదేం?" కళ్యాణి టిఫిన్ పళ్ళెంతో వచ్చింది.

కాశీపతి ఏదో గొణిగాడు.

"మా అన్నయ్యకి పెళ్ళి కుదిరిందండోయ్ ?"

"బాగుంది."

"బుధవారం వెళదాం."

"నేను రావడమెలా ? సెలవు లేదు. మా ఆఫీసరు తిక్క శంకరయ్య."

కళ్యాణి మూతి ముడుచుకుంది.

"ఏకంగా పెళ్ళయ్యాక రాలేక పోయావా ?"

"బట్టలూ అవీ యిక్కడే ఉన్నాయి. అందుకే వచ్చాను."

రాత్రి భోంచేసి పడుకున్నా కాశీపతికి భయంగానే ఉంది. కళ్యాణి యింకా నెక్లెసు చూడలేదు. చూస్తే పసిగట్టేస్తుందేమో ?

మర్నాడు శుక్రవారం. కాశీపతి లేచేసరికి కళ్యాణి లక్ష్మీపూజలో ఉంది నెక్లెస్ ధరించి. కాశీపతి గుండె ఝల్లుమంది

పరాకుగానే గడిపాడు రాత్రిదాకా. గండం గడిచింది. కళ్యాణి గుర్తించలేదు.

బుధవారం కళ్యాణి పిల్లలతో పెళ్ళికి వెళ్ళింది. వచ్చాక ఎదురయ్యే గండానికి కాశీపతికి యిప్పటినుంచే భయంగా ఉంది. అమ్మలక్కలు పెళ్ళిలో నెక్లెసు శల్యపరీక్షచేసి రోల్డుగోల్డుదని నిర్ధారణ చేస్తారు. కళ్యాణి భరతం పడుతుంది.

ఆదివారం కళ్యాణి పెళ్ళినుంచి వచ్చింది. ఉత్సాహంగా పెళ్ళి కబుర్లు చెప్పింది. కాశీపతి యింకా ఉత్సాహంగా విన్నాడు.

నెక్లెసు విషయం ఎవరూ పట్టించుకోలేదా ?

తనే అడిగాడు. "నెక్లెసు అలా మెరుస్తుందేమిటని ?"

"మర్చిపోయానండోయ్ చెప్పడం. మా పిన్ని పిలుపులకి నా నెక్లెసు వేసుకెళ్ళింది. దారిలో అది జారిపోయిందట. కొత్తది నాలుగు వందలిచ్చి కొనిచ్చింది "

కాశీపతి సంతోషించాడు.

